క్లుప్తంగా

రోటరీ ఆధ్వర్యంలో నేత్రదానం



అద్దంకి రూరల్: అద్దంకిలోని కొత్తపేటలో నివాసం ఉంటున్న మీరా క్లిఫ్ షాపు యజమాని షేక్ మీరా సాహెబ్ (85) అనారోగ్య కారణాల వల్ల సోమవారం మృతి చెందారు. మీరాసాహెబ్ కుమారుడు రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, వారి కుటుంబసభ్యుల అంగీకారంతో క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం చేశారు. పెద్ద కాకాని శంకర నేత్రాలయ వైద్యులు శాండీప్ బృందం, మృతుడు మీరా కార్నియాను సేకరించి వైద్యశాలకు తరలించారు. నేత్రదానానికి అంగీకరించిన మీరా కుటుంబ సభ్యులను రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి, రోటరీ నేత్రదాన డైరెక్టర్ చుండూరి మురళి సుధాకరరావు, ట్రెజరర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆట వస్తువుల పంపిణీ



ఆట వస్తువులు పంపిణీ నిర్వహిస్తున్న క్లబ్ అధ్యక్షుడు కృష్ణమోహన్

పర్చూరు (చినగంజాం): రోటరీ క్లబ్ పర్చూరు ఆధ్వర్యంలో నాగులపాలెంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు సోమవారం ఆట వస్తువులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ విద్యార్థులకు క్యారం బోర్డు తదితర ఆట వస్తువులను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీ విశ్వరాణి, క్లబ్ క్యారదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు కొల్లా సుబ్బారావు, పోలిశెట్టి చంద్రం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ అమలు తప్పనిసరి



విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్

మేదరమెట్ల: వసతి గృహంలో విద్యార్థులకు పెట్టే మెనూను సక్రమంగా అమలు చేయాలని తహసీల్దార్ సుబ్బారెడ్డి ఆదేశించారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలో గల ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్ఐ కృష్ణమోహన్, వీఆర్వో ప్రియాంక, వార్డెన్ సుమలత ఉన్నారు.

ప్రేమ, ఆరాధనల సమాహారమే క్రిస్మస్



వాఖ్యోపదేశం చేస్తున్న పాస్టర్ రిచర్డ్స్ పచ్చ

యద్దనపూడి: ప్రేమ, ఆరాధనల సమాహారమే క్రిస్మస్ పండుగ ముఖ్య ఉద్దేశమని సంఘ కాపరి రెవరెండ్ రిచర్డ్స్ పచ్చ అన్నారు. మండల కేంద్రం యద్దనపూడిలోని ఎపిఫనియా క్రీస్తు లూథరన్ చర్చిలో సోమవారం తెల్లవారుజాము నుంచి క్రిస్మస్ ఆరాధనలు (అడ్వెంట్) ఘనంగా ప్రారంభమయ్యాయి. నెలరోజుల పాటు ప్రతిరోజు వేకువజామునే 4 గంటల నుంచి వాఖ్యసందేశం, ప్రత్యేక కూడిక, ఆరాధన మహోత్సవాలు జరుగుతాయని రిచర్డ్స్ పచ్చ సూచించారు. ఈ సందర్భంగా క్రీస్తురాకను కాంక్షిస్తూ ఇళ్లపైన క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేశారు. అనంతరం బైబిల్‌లోని సూక్తులు, పాటలు ఆలపించారు.

సమాధుల తోట.. చెత్త దిబ్బల కోట

- డంపింగ్ యార్డుగా శ్మశానం
- శ్మశానంలో సమాధులను ముంచెత్తుతున్న చెత్త
- పట్టించుకోని అధికారులు



వాడరేవులో సమాధుల చుట్టూ నిండి ఉన్న చెత్త, వ్యర్థాలు

చీరాల టౌన్: జీవిత చరమాంకంలో ఆఖరి మజిలీ శ్మశాన వాటిక. తమ పూర్వీకులు, కుటుంబ సభ్యులు మృతిచెందితే వారి గుర్తుగా నిర్మించుకున్న సమాధుల్లోకి వెళ్లాలన్నా, మృతిచెందిన వారికి దహన సంస్కారాలు చేయాలంటే వాడరేవు గ్రామస్తులు అల్లాడుతున్నారు. కారణం శ్మశాన వాటిక మొత్తం చెత్తతో నిండిపోవడమే. వివరాల్లోకెళ్తే.. మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీతో పాటుగా తీర ప్రాంతంగా పేరొందుతున్న వాడరేవు గ్రామంలోని లైట్ హౌస్‌వద్ద ఉన్న శ్మశాన వాటిక ప్రస్తుతం డంపింగ్ యార్డుగా మారింది. గ్రామం మొత్తంలో 14 వార్డులు, 8436 జనాభా ఉన్న వాడరేవులో మత్స్యకారులు, ఇతర సామాజికవర్గాల వారు నివాసం ఉంటున్నారు. గ్రామంలో ఎవరైనా మృతిచెందితే లైట్‌హౌస్ వద్ద ఉన్న శ్మశాన వాటికలో దహన సంస్కారాలు చేయడంతో పాటు సమాధులను నిర్మించుకుంటారు. అయితే వాడరేవులో ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికి వాటిలో చెత్తను వేయకుండా గ్రామంలోని వీధుల నుంచి సేకరించిన చెత్త, వ్యర్థాలను ట్రాక్టరు, చెత్తరిక్షాల ద్వారా శ్మశాన వాటికలో డంపింగ్ చేస్తున్నారు. పంచాయతీ సెక్రటరీకి అన్ని విషయాలు తెలిసినా కానీ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని, కేవలం నాయకుల సేవలో పరితపిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

పొగతో ఊపిరాడని ప్రజలు..

నివాస ప్రాంతాల్లో సేకరించిన చెత్త, వ్యర్థాలను శ్మశానంలోని సమాధులపై వేయడంతో పాటు అప్పుడప్పుడు తగల బెట్టడంతో వస్తున్న పొగ, దుర్వాసనలతో తాము అనారోగ్యాలకు గురవుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. శ్మశానంతో పాటు సమాధులపై చెత్తను వేయడం వలన తమ వారి సమాధులు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోలేక మృతుని బంధువులు పడుతున్న అవస్థలు అనేకం. తీరానికి, గ్రామానికి దూరంగా ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని వాటిని డంపింగ్ యార్డుగా వినియోగించుకోవాలని సూచించినా గతంలో పనిచేసిన పాలవర్గం తీర్మానం చేసిన వాటిని పక్కన పడేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ప్రత్యేకాధికారుల పాలనలో అయినా శ్మశానంలో చెత్త వేయకుండా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెత్త పారవేయకుండా చర్యలు తీసుకుంటాం..

వాడరేవులో గ్రామంలో ఉన్న శ్మశానంలో చెత్తను డంపింగ్ చేస్తున్న విషయం నాకు తెలియదు. గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకుంటాం. కొన్ని రోజుల క్రితమే నేను పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టా. వాడరేవు శ్మశానంలో చెత్తను పారవేయకుండా కృషి చేస్తాం.

– కోట నాగయ్య, పంచాయితీ సెక్రటరీ

ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోమని సలహా..



తహశీల్దార్ సింగరావుకు అర్జీ ఇస్తున్న భూలక్ష్మి

జే.పంగులూరు: నాకు సంబంధించిన భూమి హద్దులు చూపించమంటే.. తీరిగ్గా నీకు భూమి కావాలంటే ప్రభుత్వ పంటకాలువ భూమిని ఆక్రమించుకో అని సర్వేయర్ సలహా ఇస్తున్నాడని ఓ మహిళ గ్రీవెన్స్‌లో తహశీల్దార్ దృష్టికి తీసుకువచ్చింది. మండల పరిధిలోని పంగులూరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం తహశీల్దార్ సింగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు 15 అర్జీలు వచ్చాయి. వాటిలో తూర్పు కొప్పెరపాడు గ్రామానికి చెందిన కొర్రపాటి భూలక్ష్మి గ్రామంలో సర్వే నెంబర్ 125–1 లో 2 ఎకరాలు పొలం ఉంది. మహిళా రైతుకు సంబంధించిన పొలం చూపించమంటే నాగర్జునసాగర్ పంట కాలువను చూపిస్తూ పంటకాలువన పూడ్చి సాగు చేసుకోమని తూర్పు కొప్పెరపాడు సర్వేయర్ సలహా ఇస్తున్నాడని చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగినై ఉండి నాకు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకో అని సలహా ఇవ్వడం, ఆక్రమించుకుంటే ఇబ్బంది ఏమి ఉందని నాకు భరోసా ఇవ్వడం నన్ను తీవ్ర ఇబ్బందికి గురిచేందని చెప్పింది. అధికారులు దయచేసి మరోసారి నా భూమిని నాకు సక్రమంగా కొలిచి రికార్డుల ప్రకారం అప్పగించాలని తహశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చింది.

దాతల సాయం అభినందనీయం

వేటపాలెం: దాతల సాయం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండల పరిధిలోని రామన్నపేట శివారులో పంట పొలాల్లో వేంచేసియున్న కనక నాగవరపమ్మ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో గల ఉసిరి చెట్టు చుట్టూ దాతల సహకారంతో ఏర్పాటు చేసిన స్టీల్ రెయిలింగ్‌ను సోమవారం ప్రారంభించారు. దాతలు పి పరమేశ్వరావు రూ. 50 వేలు, వేళ్ల వెంకట శివ రామకృష్ణప్రసాద్ రూ. 25 వేలు, ఆమంచి వెంకటస్వామి రూ.7,500, పిచ్చుక మహాలక్ష్మయ్య రూ.5 వేల మొత్తం రూ.82 వేలతో కార్తీక మాసంలో ఉసిరి చెట్టు చుట్టు స్టీలు రైలింగ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుర్మా రాహుల్జీ, కార్యదర్శి రాజు అరుణబాబు, ఆలయ ఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్యాను బహూకరణ..

జే.పంగులూరు: మండల పరిధిలోని కోటపాడు గ్రామంలోని మండల ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన దాత గోళ్లమూడి భాస్కరరావు సీలింగ్ ఫ్యాన్‌ను బహూకరించారు. కట్టా వెంకట్రావు పాఠశాలకు ఇనుప ర్యాక్‌ను బహుకరించాడు. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వేణుబాబు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

లింగ, భేదాలు లేవు.. మనుషులంతా ఒక్కటే



పంగులూరు గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలు, వీవోఏలు



మార్టూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న డీఆర్డీఏ బృందం

ఇంకొల్లు (చినగంజాం): జెండర్ ఆధారిత హింసపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ ఏ శ్రీనివాసరావు అన్నారు. మండల వెలుగు కార్యాలయంలో వీఓఏలకు 'జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేక కార్యక్రమం'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘం సభ్యులచే ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నవంబరు 25 నుంచి డిసెంబరు 23వ తేదీ వరకు నెలరోజుల పాటు మాసోత్సవాలు నిర్వహించి గ్రూపు సభ్యులందరికి జెండర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జెండర్ ఆధారిత హింస, పిల్లలకు నిరంతర విద్య, బాల్యవివాహాలు, గృహ హింస మొదలగు విషయాలపై చర్చ జరపాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ రేణుక, ఏపీఎం అనురాధ, సీసీలు అంజిరెడ్డి, రాజశేఖర్, అకౌంటెంట్ కే సుబ్బులు, గ్రామ సంఘం అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

➤ పిల్లలు పుట్టినప్పటి నుంచి వారిలో లింగ వివక్షత లేకుండా పెంచాలని పర్చూరు ఐసీడీఎస్ సీడీపీఓ జీ సుభద్ర అన్నారు. పర్చూరు వెలుగు కార్యాలయంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీసీలు ప్రమీల, విజయకుమార్, శ్రీనివాసమూర్తి, వీఓఏలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మనుషులంత ఒక్కటే..

జే.పంగులూరు: లింగ భేదాలు లేకుండా అందరు కలిసి మెలసి బతకాలని ఏపీఎం జ్యోతి ప్రసాద్‌బాబు అన్నారు. మండల పరిధిలోని వెలుగు కార్యాలయంలో సోమవారం జండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారంలో భాగంగా పంగులూరు గ్రామంలో డ్వాక్రా మహిళలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డ్వాక్రా మహిళలు కార్తీక సోమవారం సందర్భంగా, పంగులూరు టీటీడీ కళ్యాణ మండప ప్రాంగణంలో వనభోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీసీలు సాల్మన్, చంద్ర, సురేష్, వీవోఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మార్టూరు: జెండర్ ఆధారిత హింసను కలిసికట్టుగా ఎదుర్కోవటం సామాజిక బాధ్యత అని వెలుగు ఏపీఎం సురేంద్రబాబు అన్నారు. డీఆర్డీఏ ఆధ్వర్యంలో సాయంత్రం మార్టూరులో ఐసీడీఎస్, వెలుగు, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కే పద్మ, వెలుగు సిబ్బంది, బీవీ సాగర్, శోభన్ కామేశ్వరరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యాకోర్సులతో ఉద్యోగ అవకాశాలు



బ్యాంక్‌ను సందర్శించిన పెదగంజాం హైస్కూల్ విద్యార్థులు

చినగంజాం: వృత్తి విద్యాకోర్సులు పూర్తి చేయడం ద్వారా ఉద్యోగ అవకాశాలు వస్తాయని పెదగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం దేవదత్తం అన్నారు. సోమవారం విద్యార్థులకు ఇండస్ట్రియల్, రిటైల్ ట్రేడ్ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో 9,10 తరగతుల విద్యార్థులను రెండు బృందాలుగా విభజించారు. మొదటి బృందానికి రిటైల్ ట్రేడ్‌పై అవగాహన కోసం చినగంజాంలోని ఎస్ మార్ట్ రిటైల్ షాప్‌లో సర్వీసుల గురించి అవగాహన కలిగించారు. రెండో బృందానికి ఉప్పుగుండూరులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తీసుకొని వెళ్లారు. ఇందులో భాగంగా బ్యాంక్ మేనేజర్ ఎం ప్రవీణ్‌కుమార్ బ్యాంక్ సర్వీసులపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో విద్యార్థుల వెంట సుబ్రహ్మణ్యం, మోటుపల్లి రవిదేవరాజు, పీడీ అనిల్ కుమార్ ఉన్నారు.

నేడు ప్రగడ కోటయ్య వర్ధంతి

చీరాల టౌన్: ప్రజాబంధు ప్రగడ కోటయ్య 29 వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం పట్టణంలోని ప్రగడ కోటయ్య కాంస్య విగ్రహం వద్ద నిర్వహిస్తున్నామని ఆర్గనైజేషన్ ప్రతినిధులు సోమవారం ప్రకటనలో తెలిపారు. కోటయ్య వర్ధంతి సందర్భంగా సమావేశం నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో అభిమానులు, చేనేత నాయకులు, కార్మికులు అందరూ హాజరుకావాలని కమిటీ ప్రతినిధులు సూచించారు.

తీరంలో అంతటా భక్తుల కార్తీక సందడి



కారంచేడులో పూజలు చేస్తున్న మహిళలు

చీరాల టౌన్/చీరాల అర్బన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని వాడరేవు తీరంలో కార్తీక సందడి నెలకొంది. ఆఖరి కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని సుదూర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు వాడరేవుకు చేరుకుని సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించారు. కార్తీక మాసంలో కేదారేశ్వర స్వామి వ్రతాలు నోచుకునే భక్తులు విధిగా సముద్రంలో స్నానాలు చేస్తారు. దీంతో వాడరేవు తీరానికి అధికసంఖ్యలో భక్తులు వచ్చి పుణ్యస్నానాలు చేయడం వాడరేవు తీరం భక్తులతో నిండిపోయింది. రూరల్ ఎస్సై ఎ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సివిల్, మెరైన్ పోలీసులు ప్రత్యేకంగా బందోబస్తుతో పాటుగా గజ ఈతగాళ్లతో తీరం మొత్తం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు..

బల్లికురవ: కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. గంగాపార్వతి సమేత పరుసవేదీశ్వర స్వామి ఆలయంలో శివునికి పంచామృతాలతో అభిషేకం ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఎంతో చరిత్ర కలిగిన బ్రహ్మకుండంలో భక్తులు స్నానాలు చేసి అక్కడే ఉన్న నాగలింగేశ్వరుడికి జరిగిన అభిషేకాలు విశిష్టపూజల్లో భక్తులు పాల్గొన్నారు.



వాడరేవులో పర్యాటకులతో ఆహ్లాదంగా ఉన్న తీరం



బ్రహ్మకుండంలో స్నానాలు చేస్తున్న భక్తులు

ఎయిడ్స్ బాధితులపై వివక్ష నేరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సాగర్, డీఎస్పీ మోయిన్

చీరాల: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్షత చూపించడం చట్టరీత్యా నేరమని.. వారికి హక్కులు ఉన్నాయని డీఎస్పీ ఎండీ మోయిన్ అన్నారు. సోమవారం చీరాల సబ్ డివిజన్ ఆఫీసర్ కార్యాలయంలో జిల్లా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నిర్మూలన సమీకృత వ్యూహం (దిషా) హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, టీఐ చీరాల మహిళా మండలి ఆధ్వర్యంలో డీఎస్పీ కార్యాలయంలో పోలీసు సిబ్బందికి హెచ్‌ఐవీ ఎయిడ్స్ ప్రివెన్షన్, కంట్రోల్ యాక్ట్ 2017పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ హెచ్‌ఐవీ ఎయిడ్స్ కుటుంబాలకు చెందిన బాలలను పాఠశాలలో, కళాశాలల్లో ఉమ్మడి కుటుంబాల్లో సమాజంలో వారికి క్రీడల్లో పాల్గొన్నప్పుడు వారి పట్ల వివక్షత చూపించడం నేరమన్నారు. కార్యక్రమంలో సీఐ వైవీ రమణయ్య, ఎస్సైలు సురేష్, రమేష్, వెంకట్రావు, రైటర్ సుబ్బారావు, మహిళా మండలి ప్రోగ్రాం మేనేజర్ కే వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.